క్లుప్తంగా

పాఠశాలలో దసరా ఉత్సవాలు



మైలవరం: సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరావు అన్నారు. మైలవరం వివేకానంద ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో దేవీ నవరాత్రుల సందర్భంగా బుధవారం దసరా సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు అమ్మవార్ల వేషధారణలో అలరించారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ పి.రాజారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు

వరద బాధితులకు వితరణ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): బుడమేరు వరద ముంపునకు గురైన కొండపల్లి ఇందిరమ్మ కాలనీ బాధితులకు నిత్యావసర కిట్ల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్కే నగర మహిళ, ప్రజా వైద్యశాల, హ్యాపీ ఫ్యామిలీ సభ్యులు సంయుక్తంగా ఏర్పాటు చేసిన 350 కిట్లను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గొడుగులు అందజేత



విస్సన్నపేట: గాంధీ జయంతి సందర్భంగా స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులను క్లబ్ సీనియర్ సభ్యులు కుక్కడపు సతీష్‌కుమార్, అమ్మాజీ దంపతులు అందజేశారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ ఐదు వేలు తయారు చేసి రహదారి పక్కన, అటవీ ప్రాంతాల్లో క్లబ్ అధ్యక్షుడు పి. చక్రవర్తి ఆధ్వర్యంలో వెదజల్లారు. క్లబ్ సీనియర్ సభ్యులు, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా ఉత్సవాలు

తిరువూరు: తిరువూరులోని పలు దేవాలయాల్లో గురువారం దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గౌరీ కేదారేశ్వరస్వామి ఆలయం, అష్టలక్ష్మి ఆలయం, రాజ్యలక్ష్మీ సమేత రంగనాయక స్వామి ఆలయం, శాంతినగర్ కనక దుర్గాలయం, సంతోషిమాత దేవస్థానం, రామలింగేశ్వరాలయం,చంద్రమౌళీశ్వరాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపాలలో ప్రతి రోజూ అమ్మవారికి విశేషాలంకారం చేసి పూజాదికాలు జరుపుతామని నిర్వాహకులు తెలిపారు.

● ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద ఉన్న స్వయంభు కనకదుర్గమ్మవారి ఆలయంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం నుంచి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్‌బాబు తెలిపారు. అమ్మవారికి ప్రతి రోజు విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకులు శ్రీనివాస్ తెలిపారు.

విజయవాడ వెళ్లి పింఛన్ అందజేత

ముసునూరు: విజయవాడలోని సన్‌రైజ్ ఆస్పత్రి ఐసీయూలో మూత్రపిండాల వ్యాధితో చికిత్స పొందుతున్న చింతలవల్లి గ్రామానికి చెందిన జమాయమ్మను సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు రాజారామ్‌తో కలిసి పరామర్శించి పింఛన్ అందజేశారు. సర్పంచ్‌ను వైఎస్సార్ సీపీ నేతలు, అధికారులు అభినందించారు.

గురుకుల పాఠశాల మురుగుతో ఇక్కట్లు



నూజివీడు: పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ వద్ద ఉన్న బాలికల గురుకుల పాఠశాల నుంచి వస్తున్న మురుగునీరు కారణంగా ఎమ్మార్ అప్పారావు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు వెళ్లేందుకు గతంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కృషితో ప్రధాన రోడ్డుకు పక్కన కచ్చా డ్రెయినేజీ ఏర్పాటు చేయగా ఇంత వరకు మెయిన్ రోడ్డు పక్కన ఉన్న కచ్చా డ్రెయినేజీలోకి వెళ్తున్నాయి. డ్రెయినేజీలో చెత్త చెదారం పేరుకుపోవడంతో గురుకుల పాఠశాలలో విద్యార్థులు వాడిన నీరు వెళ్లడానికి వీలులేక ఎమ్మార్ అప్పారావు కాలనీ వైపునకు వెళ్లే రోడ్డుపైకి వస్తున్నాయి. రోజుల తరబడి మురుగునీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. ప్రధాన రహదారి వెంబడి ఉన్న కచ్చా డ్రెయిన్‌లోని పూడికను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గాంధీజీ మార్గం అనుసరణీయం

● ఘనంగా గాంధీ జయంతి కార్యక్రమాలు
● విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళి
● గ్రామ స్వరాజ్యం సాధనకు కృషి చేయాలని వక్తల పిలుపు



నూజివీడులో నివాళులర్పిస్తున్న మేకా వెంకట ప్రతాప్ అప్పారావు తదితరులు



తిరువూరులో నివాళులర్పిస్తున్న స్వామిదాసు, నాయకులు

నూజివీడు: దేశ స్వాతంత్ర్యం కోసం మహాత్మా గాంధీజీ అవలంభించిన అహింసా మార్గం ఆచరణీయమని పలువురు వక్తలు అన్నారు. గాంధీ జయంతి కార్యక్రమాలు నూజివీడు, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ సేవలను వక్తలు కొనియాడారు. నూజివీడు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి ప్రతాప్ అప్పారావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ, పిళ్లా చరణ్, మలిశెట్టి బాబీ, యర్రంశెట్టి రవితేజ, సలుమూరి మూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు పట్టణంలోని చిన్న గాంధీబొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

● బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద గాంధీ బొమ్మ సెంటర్‌లోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు బోను అప్పారావు, మల్లిపూడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నాయకులు మరీదు కృష్ణ, బీడీ రవికుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు.

● జి.కొండూరు: కుంటముక్కల లింగాల సుందరం లైబ్రరీలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సర్పంచ్ వంగూరు కుమారి, లైబ్రరీ కన్వీనర్ వంగూరు కెనడీ, విద్యార్థులు పాల్గొన్నారు.

● గంపలగూడెం: గోసవీడు, గంపలగూడెం బస్టాప్ సెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు గాంధీజీ సేవలను కొనియాడారు. ఆర్య వైశ్య సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాళ్లా చిన్న సత్యంబాబు, మహిళా సంఘం మండల అధ్యక్షులు వనమా సుజాత, వనమా సత్యవాణి, వర్తక సంఘం అధ్యక్షులు చారుగుండ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. పెనుగొలను గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శ్రీలత, పాఠకులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత బాపూజీ

తిరువూరు: జాతీయోద్యమంలో నిస్వార్థంగా పోరాడి బ్రిటిష్ పాలకులను దేశం నుంచి తరిమికొట్టే వరకు విశ్రమించని మహాత్మాగాంధీ అందరికీ ఆదర్శ ప్రాయుడని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి స్వామిదాసు పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోరాట పటిమను వక్తలు వివరించారు. పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వల్లెపాటి శ్రీనివాసరావు, నాయకులు నివాళులర్పించారు. తిరువూరు నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ లోవరాజు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

● మైలవరం: మైలవరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పాలా నారాయణరెడ్డి అధ్వర్యంలో మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు జరిగాయి. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైలవరం మండల అధ్యక్షుడు గర్నేపూడి వెంకట్రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మైలవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీటీ కిశోర్, సీనియర్ న్యాయవాది ఎస్‌వీకే సత్యనారాయణరావు, సీనియర్ న్యాయవాదులు పావులూరి వెంకట శేషగిరిరావు, బుద్ధవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు. శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, కరస్పాండెంట్ జె. రాధాకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు కార్యాయంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు కోయ సుధ ఆధ్వర్యంలో మహిళలకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. చంద్రాల జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మైలవరంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నూజివీడు రోడ్డులోని మహాత్మా గాంధీ విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మైలవరం ఆరో వార్డులోని ఎంపీపీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాత్ములను స్మరించుకోవాలి..

ఇబ్రహీంపట్నం: బ్రిటిష్ వారితో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహాత్ములను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అన్నారు. ఎన్టీటీపీఎస్‌లోని పరిపాలనా భవనంలో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళర్పించారు. సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మైలవరంలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

● ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ అబ్దుల్ సలాం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆగిరిపల్లిలో పిరమిడ్ ధ్యాన మందిరం వారి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్, సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి పాల్గొన్నారు. సురవరం ప్రాథమిక పాఠశాలలో గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

చాట్రాయి: చనుబండలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు జల్లేపల్లి పరమేశ్వరావు, చినబాబు వంకిణి వెంకటేశ్వరరావు, పి.శివ, వనమా వాసు, డాక్టర్ నాగేశ్వరరావు, విస్సంపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామకృష్ణ తదితరులు గాంధీజీకి నివాళులర్పించారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం గాంధీజీ, శాస్త్రీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

● తిరువూరు: స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఐడియాస్ సేవా సంస్థ కార్యాలయంలో మహాత్ముడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి తదితరులు పాల్గొన్నారు.

● తిరువూరురూరల్: పెద్దవరం, ఎర్రమాడు, లక్ష్మీపురం, ఆంజనేయపురం పంచాయతీ కార్యాలయాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల, అక్కపాలెం ఎంపీయూపీ స్కూల్లో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.



నూజివీడు చిన్న గాంధీబొమ్మ సెంటర్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో నివాళి



గంపలగూడెం హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



చనుబండలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తిరువూరు ఐడియాస్ సేవా సంస్థలో నివాళి

స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు వారధులు మహాత్ములు

ముసునూరు: భారతావని అంతటా స్వేచ్ఛ, స్వాతంత్ర్య వెలుగులు నింపేందుకు కృషి చేసిన గాంధీజీ, శాస్త్రీజీ భారత రత్నాలుగా చరిత్రలో నిలిచారని ఎంపీడీఓ జి.రాణి అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల సచివాలయాల వద్ద భారత జాతిపిత గాంధీజీ, దేశ రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఈఓపీఆర్డీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీజీ, శాస్త్రీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చింతలవల్లి, బలివే, లోపూడి, గుళ్లపూడి, గోపవరం, రమణక్కపేట, వేల్పుచర్ల సర్పంచ్‌లు పిల్లి సత్యనారాయణ, రావు ప్రవీణసుధాకర్, పేరం కృష్ణ, ఆర్. శ్రీదేవి, కంచర్ల వాణి, రంగు ధనలక్ష్మి, ఎస్. సత్య నారాయణ, పి.మోహనరావు తదితరులు గాంధీజీ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బుడమేరు ఆధునికీకరణపై సీఎం ప్రత్యేక దృష్టి

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్



రాయనపాడు గ్రామ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత


రాయనపాడు(విజయవాడ రూరల్): బుడమేరు ఆధునికీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. బుధవారం రాయనపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచి కాటంనేని కల్యాణి అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆపరేషన్ బుడమేరు పేరుతో భవిష్యత్‌లో వరదలు రాకుండా తగు చర్యలు చేపట్టనున్నామని వివరించారు.

అధికారుల తప్పిదం వల్లే సాయంలో అన్యాయం..

కొందరు అధికారుల తప్పిదం, పని ఒత్తిడి వల్ల రాయనపాడుకు వరద విపత్తు సాయం అందడంలో కొంత అన్యాయం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. 912 మందికి ఇప్పటికే వరద విపత్తు సాయాన్ని చెల్లించగా మరో 133 మందికి కూడా సాయం చేసేందుకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. రాయనపాడుకు ఉపాధి నిధులు రూ. 63 లక్షలు ఇప్పటికే మంజూరు చేశామన్నారు. ఈ నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని చెప్పారు. కేఎల్ రావు సప్లయ్ చానల్ గండ్ల పూడ్చివేతకు చర్యలు తీసుకుంటామన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు, కాటంనేని పూర్ణచంద్రరావు, కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● పైడూరుపాడు, షాబాదు–జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి గ్రామ పంచాయతీ వద్ద గ్రామ సభలు జరిగాయి. గాంధీజీ చిత్రపటాలకు ప్రజా ప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



మున్సిపల్ కార్యాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్

నూజివీడు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో బుధవారం ట్రిపుల్ ఐటీ ఆవరణను శుభ్రం చేశారు. సివిల్ డిపార్ట్‌మెంట్ ల్యాబ్‌ల వద్ద డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్ర కుమార్ మొక్కలు నాటి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించవచ్చన్నారు. ఏఓ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ రత్నాకర్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ బ్రహ్మస్వాములు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో..

నూజివీడు ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకటరామిరెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు, మున్సిపల్, మెప్మా సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణను శుభ్రం చేశారు. వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మాజీ వైస్ చైర్మన్, కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద..

తహసీల్దార్ కార్యాలయ ఆవరణను ఇన్‌చార్జి తహసీల్దార్ డి.సుబ్బారావు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు కలిసి శుభ్రం చేశారు. కార్యాలయం గేటు పక్కన డ్రెయిన్‌లో పూడికను తొలగించారు. వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాగన్ వర్క్‌షాపులో..

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం బుధవారం జరిగింది. వర్క్‌షాపు చీఫ్ మేనేజర్ శ్రీనివాస్, కార్మికులు స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఆరోగ్య శిబిరం నిర్వహించి మొక్కలు నాటారు.

నేడు ఘాట్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుంచి కొండపై ఉన్న మల్లికార్జునస్వామి ఆలయం వరకు ఘాట్ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రులు కొలుసు పార్థసారథి, ఆనం రామనారాయణ రెడ్డి గురువారం శంకుస్థాపన చేస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబు తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: సక్షమ్ దివ్యాంగుల సేవా సంస్థ, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని ఫెర్రీ రామాలయం వద్ద వరద ముంపు దివ్యాంగ బాధితులకు నితావసర సరుకులు బుధవారం పంపిణీ చేశారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దొనబండలో సీఐటీయూ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

ముసునూరు: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలతో గ్రామాల్లో కాలుష్య సమస్యలు తొలగించాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని సూచించారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ జి.రాణి ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లోని సచివాలయాలు, చెత్త శుద్ధి కేంద్రాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన బుధవారం స్వచ్ఛతా హీ సేవ ముగింపు గ్రామ సభలు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు (గ్రీన్ అంబాసిడర్స్)ను ఘనంగా సన్మానించారు. రమణక్కపేటలో సర్పంచ్ రంగు ధనలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రీన్ అంబాసిడర్స్‌ను సన్మానించారు.

పారిశుద్ధ్య కార్మికురాలికి సత్కారం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ పారిశుద్ధ్య విభాగంలో నిబద్ధతతో పనిచేసిన కార్మికురాలు మేదుగు భారతిని గాంధీ జయంతి సందర్భంగా బుధవారం అధికారులు, కౌన్సిలర్లు సత్కరించారు. కమిషనర్ లోవరాజు, కౌన్సిలర్లు హుస్సేన్, సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్

విస్సన్నపేట: విస్సన్నపేట శివారులో బుధవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుండి రూ.9,080 స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు.

ఖైదీలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలి

నూజివీడు: రిమాండ్ ఖైదీలు సత్‌ప్రవర్తన కలిగి ఉండాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం. శివపార్వతి అన్నారు. స్థానిక సబ్ జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పుల వల్లే జైళ్ల పాలవుతున్నారని చెప్పారు. అనంతరం రిమాండ్ ఖైదీలకు స్వీట్లు పంచారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్, సీనియర్ న్యాయవాది అర్జునరావు, సబ్ జైల్ సూపరింటెండెంట్ గంగినేని ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

ముసునూరు: మండలంలోని వేల్పుచర్ల జెడ్పీ హైస్కూల్ వద్ద గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని సర్పంచ్ పుట్ల మోహనరావు తెలిపారు. ఏలూరుకు చెందిన ఎముకల వైద్య నిపుణులు సునీల్ సందీప్ బృందం వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. అవసరమైన వారికి ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు.

హామీలు మరిచి వివాదాలతో కాలక్షేపం

● ఎమ్మెల్యే కొలికపూడి వ్యాఖ్యలు గర్హనీయం
● ఖండించిన నల్లగట్ల స్వామిదాసు



విలేకరులతో మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: రైతులను కించపరుస్తూ తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరువూరు ఎమ్మెల్యే విలేకరులను, మహిళలను దూషించడం, బెదిరించడంతో పాటు రైతులను కూడా కించపరుస్తూ బహిరంగ వ్యాఖ్యలు చేయడం, వారిని కుక్కల కంటే హీనమంటూ దూషించడం దారుణమన్నారు. ఇకపై ఎమ్మెల్యే ఇష్టానుసారం మాట్లాడితే తాము చూస్తూ ఊరుకోబోమని, తగు రీతిలో సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం అనవసర వివాదాలతో కాలక్షేపం చేస్తోందన్నారు. తిరుపతి లడ్డూ గురించి అవాకులు చెవాకులు మాట్లాడిన సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టు చివాట్లు పెట్టేవరకు ఆగలేదన్నారు. తిరువూరు ఎమ్మెల్యే సైతం గెలిచిన నాటి నుంచి వివాదాలతో సరిపెడుతూ ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని స్వామిదాసు విమర్శించారు. ప్రజలకు సేవ చేస్తారనే ఆశతో గెలిపిస్తే ఎమ్మెల్యే ఇష్టానుసారం ప్రవర్తిస్తూ అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారని, ఆయన వైఖరి సొంత పార్టీ నాయకులకే వెగటు పుట్టిస్తోందని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, నాయకులు నరెడ్ల వీరారెడ్డి, శీలం నాగ నర్సిరెడ్డి, జెడ్పీటీసీ యరమల రామచంద్రారెడ్డి, స్థానిక నాయకులు పరసా శ్రీనివాసరావు, జాకీర్, ఆదినారాయణ, సీతారామయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

తిరువూరురూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయపురం సర్పంచి మామిడి కుటుంబరావు అన్నారు. ఉపాధి హామీ పథకం పనులపై పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ జరిగింది. వ్యవసాయ పనులు లేని వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచి తెలిపారు. పెద్దవరం, ఎర్రమాడు, లక్ష్మీపురం గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథకం సభల్లో పనుల గుర్తింపుపై ప్రతిపాదనలు ఆమోదించారు.

● విస్సన్నపేట: మండలంలోని అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామ సభలు బుధవారం నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. తాతకుంట్ల పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన గ్రామ సభలో ఉపాధిహామీ పథకంలో కొత్త పనులు గుర్తింపుపై గ్రామస్తులకు ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ వివరించారు. సర్పంచ్ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ పాల్గొన్నారు. పుట్రేల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభలో సర్పంచ్ కారుమంచి స్వాతి, ఏపీఓ అనురాధ పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సమావేశం

నూజివీడు: స్థానిక మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం ఈనెల 4న మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపీపీ ఆరేపల్లి శిరీష అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ సి. రాఘవేంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొంటారన్నారు.